
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



అల్లూరి సీతారామరాజు

జిల్లా వార్తలు

సోమవారం 1 ఏప్రిల్ 2024

దక్షిణ అభ్యర్థి వంశీకృష్ణ



- ఉత్కంఠకు తెరదించిన జనసేన అధిష్ఠానం

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గానికి అభ్యర్థి ప్రకటనపై కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఇక్కడ నుంచి కూటమి అభ్యర్థిగా సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ టికెట్ ఖరారు చేశారు. ఈ మేరకు పార్టీ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ, జనసేన ... మిగతా 6వ పేజీలో

ఢిల్లీ బోణీ



డేవిడ్ వార్నర్ 51 (33 బంతులు)

రిషబ్ పంత్ 50 (31 బంతులు)

హోం గ్రౌండ్‌లో సత్తాచాటిన క్యాపిటల్స్ జట్టు

- చెన్నైపై 20 పరుగుల తేడాతో విజయం
- బ్యాటింగ్‌లో ప్రతిభ చూపిన కెప్టెన్ రిషబ్ పంత్
- వార్నర్, పృథ్వీషా మెరుపులు
- చివరి వరకు పోరాడిన ధోనీ

విశాఖపట్నం (స్పోర్ట్స్), మార్చి 31:

సిక్సర్లు, బౌండరీలతో ఏసీఏ వీడీసీఏ స్టేడియం హోరెత్తింది. ప్రేక్షకుల కేరింతలతో మార్మోగింది. హోం గ్రౌండ్‌లో ప్రేక్షకుల నుంచి కనీస ప్రోత్సాహం లభించకపోయినా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఈ సీజన్‌లో తొలి విజయాన్నందుకుంది. ఆదివారం పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య ఢిల్లీ క్యాపిటల్స్ 20 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌పై విజయం సాధించింది. ఆశించిన స్థాయిలో మ్యాచ్ ఆద్యంతం ఇరుజట్ల ఆటగాళ్లు ప్రేక్షకులకు ఐపీఎల్ మజాను అందించకపోయినా, ధోనీ బ్యాటింగ్‌కు దిగడంతో సగటు క్రీడాభిమానులు సంతృప్తి చెందారు. చివర్లో ధనా ధన్ బ్యాటింగ్‌తో ధోనీ మెరుపులు ప్రేక్షకులను ఆనందడోలికల్లో తేలించాయి.



ధోనీ 37 (16 బంతులు)

పృథ్వీషా 43 (27 బంతులు)

పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంను హోం గ్రౌండ్‌గా ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సభ్యులు బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించడంతో చెన్నైపై ఘన విజయం సాధించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆదిలో కొంచెం నెమ్మదిగా ఆడింది. మూడో ఓవర్‌లో చాహర్ బౌలింగ్‌లో డీప్ స్క్వేర్ లెగ్ మీదుగా డేవిడ్ వార్నర్ సిక్సర్ కొట్టడంతో ఊపు వచ్చింది. ఇక ఐదో ఓవర్‌లో వార్నర్ చెలరేగాడు. చాహర్ బౌలింగ్‌లో లాంగ్ లెగ్ మీదుగా సిక్సర్ బాది, తర్వాత బంతిని ఎక్స్‌ట్రా కవర్, పాయింట్ మీదుగా వరుసగా రెండు బౌండరీలు కొట్టి 14 పరుగులు ... మిగతా 5వ పేజీలో

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



అరకులోయ ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లాలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏసు పునరుత్థానం సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. చర్చిల్లో ప్రార్థనలు చేశారు. భక్తి గీతాలను ఆలపించారు.

- వార్త 6వ పేజీలో..

దాహం కేకలు

చింతపల్లిలో తాగునీటికి కటకట

- ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోని అధికారులు
- ప్రజలకు తప్పని అవస్థలు
- అడుగంటిన బావులు
- సీపీడబ్ల్యూ పథకం ద్వారా నిలిచిపోయిన నీటి సరఫరా



దూర ప్రాంతాల నుంచి ట్రాక్టర్‌తో నీళ్లు తెచ్చుకుంటున్న సాయినగర్ ప్రజలు

చింతపల్లి, మార్చి 31:

భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. పదిహేను రోజులుగా కొళాయిల ద్వారా మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దూర ప్రాంతాల నుంచి ట్యాంకర్లతో నీళ్లు తెప్పించుకోవలసిన పరిస్థితి నెలకొంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో చింతపల్లి ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

చింతపల్లి మండల కేంద్రంలో 13 ఏళ్ల కిందట స్థానిక ప్రజలకు నీటి సరఫరా చేసేందుకు సీపీడబ్ల్యూ పథకం నిర్మించారు. ఈ పథకం పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించారు. ఈ పథకం ద్వారా మండల కేంద్రంలో ఉన్న 17 వీధులు, చిన్నగెడ్డ, కందులగాంది, చిలకల మామిడి, బాలాజీపేట గ్రామాల పరిధిలో ఉన్న ప్రజలకు నీటి సరఫరా జరుగుతున్నది. 17 వీధులు, నాలుగు గ్రామాల్లో నివాసముంటున్న 12 వేల మంది ప్రజలకు



పెదపైపు నుంచి కావడితో తెచ్చుకుంటున్న గిరిజనుడు

సీపీడబ్ల్యూ పథకం ఒక్కటే ఆధారం. ఈ పథకం ద్వారా నీటి సరఫరా చేసేందుకు సాయిబాబా దేవాలయంలో లక్షా యాభై వేలు, అరవై వేలు సామర్థ్యం కలిగిన రెండు నీళ్ల ట్యాంకులు ఉన్నాయి. ఈ ట్యాంక్‌లకు చిన్నగెడ్డ, గూణలంకలో ఉన్న రెండు బావుల నుంచి నీటిని నింపుతున్నారు. ఈ రెండు ట్యాంక్‌లు నుంచి పబ్లిక్ కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం చిన్నగెడ్డ, గూణలంక బావులు అడుగంటి పోయాయి. దీంతో సీపీడబ్ల్యూ పథకం ట్యాంకులకు నీటి సరఫరా జరగడం లేదు. ట్యాంక్‌లు నిండే పరిస్థితి లేక 15 రోజులుగా కొళాయిల ద్వారా నీటి ... మిగతా 6వ పేజీలో

ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాదా..?

రెండు కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

కనీసం పట్టించుకోని అధికార యంత్రాంగం



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పాడేరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి):

ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజాప్రతినిధులు ప్రజలకు ఎటువంటి సాయం లేదా పథకాల లబ్ధిని చేకూర్చకూడదు. అటువంటివి ఏమైనా ఉన్నా కేవలం ప్రభుత్వ యంత్రాంగం ద్వారా మాత్రమే వారికి అందించాలి. కానీ అందుకు భిన్నంగా సాక్షాత్తూ స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోడ్‌ను ఉల్లంఘిస్తూ... రెండు కుటుంబాలకు విడుదలైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఆ విషయం ఎమ్మెల్యేకు చెందిన వాట్సాప్ గ్రూప్‌లోనే పోస్టు చేయడంతో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. నియోజకవర్గం పరిధి చింతపల్లిలోని పెదపైపు వీధికి చెందిన గోకాడ సుబ్బలక్ష్మి, జీకేవీధికి చెందిన మహ్మద్‌బేగం కుటుంబాలకు చెందిన వారు అనారోగ్యంతో బాధపడుతున్నారని ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేశారు. దీంతో గోకాడ సుబ్బలక్ష్మికి రూ.75 వేలు, మహ్మద్ బేగంకు రూ.70 వేలు మంజూరయ్యాయి. వారిద్దరికి శనివారం పాడేరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయా చెక్కులను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అందించారు. అయితే ప్రస్తుతం కోడ్ అమల్లో వున్న తరుణంలో ఆమె ప్రభుత్వ సహాయాన్ని బాధితులకు పంపిణీ చేయడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదే క్రమంలో జిల్లా కేంద్రంలోనే కోడ్ ఉల్లంఘన జరిగితే అధికారులు పట్టించుకోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అప్రమత్తంగా ఉండి ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

3 నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ

- సచివాలయం వద్ద అందజేత

పాడేరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తేదీన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర వర్గాలకు అందజేసే సామాజిక పింఛన్లు ఈ పర్యాయం ఏప్రిల్ మూడో తేదీన పంపిణీ చేయనున్నారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగిసే క్రమంలో బ్యాంకుల్లో హడావిడి, వరుస సెలవులు రావడం, ఏప్రిల్ ఒకటిన బ్యాంకులకు సెలవు దినం కావడంతో పింఛన్లకు అవసరమైన సొమ్ము డ్రా చేయడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో ఏప్రిల్ ఒకటో తేదీన కాకుండా మూడో తేదీన పింఛన్ల పంపిణీ జరుగుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో ఏప్రిల్ మూడో తేదీన పంపిణీ చేయనున్న పింఛన్‌దారుల జాబితా ఆదివారం అందలేదు. అయితే మార్చి ఒకటో తేదీన జిల్లాలో 1,29,285 మందికి పింఛన్లు అందజేశారు. కాగా ప్రతి నెల పింఛన్ల సంఖ్యలో స్వల్ప మార్పులు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ నెలకు సంబంధించి పింఛన్ల జాబితా సోమవారం ఉదయం వస్తుందని పేర్కొన్నారు. పింఛన్ల జాబితా వచ్చిన వెంటనే పింఛన్ల వివరాల మేరకు సొమ్మును సంబంధిత సచివాలయ ఉద్యోగులకు అందజేస్తారు. ఈ పర్యాయం వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయనందున వారి బాధ్యతను సంబంధిత సచివాలయం పరిధిలో ఉద్యోగులకు కేటాయించారు. సగటున సచివాలయంలో ఒక ఉద్యోగికి పది నుంచి 15 మంది వలంటీర్లు పంపిణీ చేసే మొత్తాలను ఇవ్వనున్నారు. అయితే ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్, మే నెలలో పింఛన్ల పంపిణీ పింఛన్‌దారుల ఇళ్ల వద్ద కాకుండా సచివాలయంలో అందజేస్తారు. ఈ విషయాన్ని సెర్ప్ అధికారులు ఆదివారం వెల్లడించారు. పింఛన్లు తీసుకునే వారంతా తమతోపాటు ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన పింఛన్ పుస్తకంలో సీఎం జగన్ బొమ్మ ఉన్నందున దానిని వెంట తీసుకురావద్దని స్పష్టం చేశారు. కాగా వలంటీర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, బయోమెట్రిక్ యంత్రాలను స్వాధీనం చేసుకోవాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు అందాయి. సోమవారం ఉదయమే వలంటీర్ల నుంచి వీటిని స్వాధీనం చేసుకుని సచివాలయ సిబ్బందికి అందజేస్తామని అధికారి ఒకరు తెలిపారు.

ఆశలు అవుట్!

క్రమబద్ధీకరిస్తామని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పాదయాత్ర సమయంలో జగన్ హామీ

- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం
- సీఎం తీరుపై ఉద్యోగుల మండిపాటు
- ఉమ్మడి జిల్లాలో పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సుమారు 30 వేల మంది ఉద్యోగులు



పాదయాత్రలో జగన్‌తో కలిసి నడుస్తున్న మణి, కాంట్రాక్టు ఉద్యోగులు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

పాదయాత్ర సమయంలో హామీలనిచ్చి... అధికారంలోకి వచ్చిన తరువాత మరిచిపోయిన ముఖ్యమంత్రి జగన్ తీరుపై కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టులోకి తెస్తామని ఇచ్చిన హామీకి జగన్ మంగళం పాడేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న సుమారు 25 వేల మంది అవుట్ సోర్సింగ్, మరో ఐదు వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని మండిపడుతున్నారు.

ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీలతో ఆశలు పెట్టుకున్నామని, వేతనాలు పెరిగి జీవితాలు బాగుపడతాయని భావించామని, తీరా ఐదేళ్లు గడిచినా ఒక్కటి కూడా అమలుకాక ఇబ్బందులు పడుతున్నామని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు. జగన్ ఇచ్చిన హామీల అమలుకోసం ఐదేళ్లుగా నేతల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో దాదాపు 70 శాతం మంది ఆరోగ్యశాఖలో పని చేస్తుండగా, మిగిలిన 30 శాతం మంది జీవీఎంసీ, ఫారెస్ట్, సమగ్ర శిక్ష అభియాన్, పశు సంవర్ధక శాఖల్లో పనిచేస్తున్నారు.

హామీ అమలుకు మంగళం

సీఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేసి ఉంటే జిల్లాలో 30 వేల మందికిపైగా ... మిగతా 6వ పేజీలో

నమ్మించి మోసం చేశారు

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మేలు చేస్తామని ఇచ్చిన హామీని అమలుచేయకుండా నమ్మించి మోసం చేశారు. ఐదేళ్లుగా ప్రభుత్వ ప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది. ఉద్యోగులకు భద్రత, ఇతర బెనిఫిట్స్ అందిస్తామని ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారు. కేంద్ర పరిధిలోని స్కీమ్ అంటూ అడ్డగోలు వాదనను తెరపైకి తీసుకురావడం దారుణం. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 30 వేల మంది ఉద్యోగులకు ఈ ప్రభుత్వం అన్యాయం చేసింది.

- పి.మణి, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.14
సహరి (మంగళ)	4.37

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

- మృతులు విశాఖ ఏవీఎన్ కళాశాల విద్యార్థులు
- వివాహానికి వెళ్లి వస్తుండగా సంతగండువ గ్రామ సమీపంలో ప్రమాదం

పాడేరురూరల్, మార్చి 31:

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై వివాహానికి వెళ్లి వస్తుండగా శనివారం అర్ధరాత్రి సంతగండువ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మరో యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. దీనికి సంబంధించి స్థానిక ఎస్‌ఐ జి.లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని ఇరడాపల్లి పంచాయతీ సంతగండువ గ్రామంలో శనివారం జరిగిన వివాహానికి చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీ మేడివాడ గ్రామానికి చెందిన కొర్రా చిరంజీవి(20), విశాఖపట్నం కైలాసపురానికి చెందిన లగుడు శంకర్(21) హాజరై శనివారం అర్ధరాత్రి తిరిగి వస్తున్నారు. అదే వివాహానికి ద్విచక్రవాహనంపై వస్తున్న జి.మాడుగుల మండలం కె.కోడాపల్లి గ్రామానికి చెందిన ప్రదీప్ అనే యువకుడు సంతగండువ గ్రామ సమీపంలో వీరి వాహనాన్ని బలంగా ఢీకొన్నాడు. దీంతో చిరంజీవి సంఘటన స్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన శంకర్, ప్రదీప్‌లను పోలీసులు స్థానిక జిల్లా ఆస్పత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో శంకర్ మృతి చెందాడు. ప్రదీప్ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. మృతులు చిరంజీవి, శంకర్ విశాఖపట్నం ఏవీఎన్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు.



చిరంజీవి మృతదేహం



శంకర్ మృతదేహం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

ఐపీఎల్ సందడి





దీపక్ చాహర్ బౌలింగ్



రవీంద్ర జడేజా



టాస్ వేస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషబ్‌పంత్, చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్



గాల్లో క్యాచ్ పడుతున్న పతిరాణా



వికెట్ తీసిన ఆనందంలో చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు



ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆటగాడు డేవిడ్ వార్నర్ బ్యాటింగ్



వికెట్ తీసిన ఆనందంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు



స్టేడియంలో చీర్ గాళ్స్ సందడి

పీఎం పాలెం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్‌కింగ్స్ జట్ల మధ్య జరిగిన టీ 20 రసవత్తరంగా సాగింది. ఆది నుంచీ ధోనీ అభిమానులతో స్టేడియంలో సందడి నెలకొంది. పసుపు జెర్సీలను ధరించిన అభిమానులు కేవలం ధోనీ బ్యాటింగ్ కోసమే స్టేడియంకు వచ్చామా అన్నట్టుగా ఎదురుచూశారు. తొలి రెండు మ్యాచ్‌లలో బ్యాటింగ్ చేయని ధోనీ విశాఖలో బ్యాటింగ్‌కు రావడంతో కేరింతలు కొట్టారు. చెన్నై ఓడిపోయినా ధోనీ బ్యాటింగ్ చూసినందుకు సంబరాలు చేసుకున్నారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



జాతీయ పతాకంతో క్రికెట్ అభిమానులు

ఢిల్లీ బోణీ

... 3వ పేజీ తరువాయి

రాబట్టాడు. ఈ స్థితిలో ఢిల్లీ క్యాపిటల్స్ 5.2 ఓవర్లలో 50 పరుగులు చేసింది. ఆరో ఓవర్‌లో మరో ఓపెనర్ పృథ్వీ షా బ్యాట్ ఝుళిపించాడు. ముస్తఫిజర్ బౌలింగ్‌లో షార్ట్ ఫైన్ లెగ్, ఫైన్ లెగ్, థర్డ్ మ్యాన్ మీదుగా వరుస బౌండరీలు బాదాడు. మ్యాచ్ ఏడో ఓవర్‌లో రవీంద్ర జడేజా బౌలింగ్‌కు వచ్చాడు. జడేజా వేసిన రెండో బంతిని పృథ్వీ షా మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ కొట్టగా, నాల్గో బంతిని డేవిడ్ వార్నర్ స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీకి తరలించాడు. 33 బంతుల్లో మూడు సిక్సర్లు, ఐదు బౌండరీలతో హాఫ్ సెంచరీ (51) పూర్తి చేసిన డేవిడ్ వార్నర్, పదో ఓవర్‌లో ముస్తఫిజర్ బౌలింగ్‌లో పతిరానా గాలిలో అద్భుతమైన క్యాచ్ పట్టడంతో అవుటయ్యాడు. తర్వాత ఓవర్‌లో 27 బంతుల్లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 43 పరుగులు చేసిన పృథ్వీ షా, జడేజా బౌలింగ్ స్టంపౌట్ అయ్యాడు. 10.3 ఓవర్లలో ఢిల్లీ క్యాపిటల్స్, వంద పరుగులు పూర్తి చేసింది. వరుసగా వికెట్లు పడిపోయి స్కోరు మందగించిన సమయంలో 13వ ఓవర్‌లో జడేజా బౌలింగ్‌లో మిడ్ వికెట్ మీదుగా పంత్ భారీ సిక్సర్ కొట్టాడు. పతిరాణా బౌలింగ్‌లో స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీ కొట్టిన మార్ష్ (18), తర్వాత బంతికి క్లీన్ బౌల్డ్ కాగా, మార్ష్ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన స్టబ్స్ (0) పరుగులేమీ చేయకుండానే అవుటయ్యాడు. కాగా 18వ ఓవర్‌లో రిషబ్ పంత్ చెలరేగాడు. పతిరాణా బౌలింగ్‌లో లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్, బౌండరీ, పాయింట్ మీదుగా మరో బౌండరీ కొట్టి ప్రేక్షకులను ఉత్సాహపరిచి (50), 31 బంతుల్లో నాలుగు బౌండరీలు, సిక్సర్లతో అర్ధ సెంచరీ పూర్తి చేసి ఐదో వికెట్‌గా పెవిలియన్‌కు చేరాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 191 పరుగులు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ తుది జట్టులో లోకల్ బాయ్‌కు రిక్కీబుయ్‌కు చోటు దక్కలేదు. లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 171 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఏడు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన దశలో రహానే (45), మిచెల్ (34) జట్టును ఆదుకున్నారు. దుబే (18) కొద్ది సేపు మెరిశాడు. వరుసగా వికెట్లు పడిపోయిన దశలో ధోనీ బ్యాటింగ్‌కు దిగడంతో ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. మూడు సిక్సర్లు, ఒక బౌండరీతో 37 పరుగులు చేసిన ధోనీకి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్ రెండు, ముకేష్‌కుమార్ మూడు వికెట్లు పడగొట్టారు.

ధోనీకి ప్రేక్షకుల అరుదైన గౌరవం



అత్యధిక సిక్స్‌లు కొట్టినందుకు అవార్డు అందుకుంటున్న ధోనీ

ఎనిమిదో నంబరు బ్యాట్స్‌మన్‌గా గ్రౌండ్‌లోకి వచ్చిన ధోనీకి...గ్యాలరీలోని ప్రేక్షకులంతా లేచి నిలబడి కేరింతలతో స్వాగతం పలికారు. ఈ సీజన్‌లో తొలి సారి బ్యాటింగ్ చేసిన ధోనీ... తాను ఎదుర్కొన్న తొలి బంతిని బౌండరీకి తరలించడంతో స్టేడియం హోరెత్తింది. రెండో బంతికి అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అదే ఓవర్‌లో మరో బౌండరీ కొట్టడంతో ప్రేక్షకులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. అతను బ్యాటింగ్ చేస్తున్నంతసేపు ప్రేక్షకులు ధోనీ...ధోనీ అంటూ నినాదాలతో స్టేడియం మారుమ్రోగింది.

ఇదిలా ఉండగా చెన్నై సూపర్ కింగ్స్ విజయం కన్నా...ధోనీ బ్యాటింగ్ చేయాలని ప్రేక్షకులు కోరుకోవడం విశేషం. చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా వికెట్లు పడిపోతూ ఓటమి దిశగా సాగుతున్నా ప్రేక్షకుల పట్టించుకోలేదు. ఒక రకంగా చెప్పాలంటే వికెట్ పడుతున్న ప్రతిసారి ధోనీ బ్యాటింగ్‌కు వస్తాడనే ఆసక్తి వారిలో కినిపించింది. దుబే ఆరో వికెట్‌గా అవుటైన తర్వాత ధోనీ బ్యాటింగ్‌కు రావడంతో స్టేడియంలోని ప్రేక్షకులు హుషారుతో సంబరాలు చేసుకున్నారు. ధోనీ క్రీజులో ఉన్నంతసేపు కేరింతలు కొడుతూనే ఉన్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ ఓడిపోయినా ధోనీ బ్యాటింగ్ చూశామనే ఆనందంతో ప్రేక్షకులు ఇంటి ముఖం పట్టారు.

సీఎస్‌కే జెర్సీలతో స్టేడియం పసుపు మయం

» హోం గ్రౌండ్‌లో కనిపించని ఢిల్లీ క్యాపిటల్స్ జెర్సీలు

విశాఖపట్నం (స్పోర్ట్సు) / మధురవాడ, మార్చి 31 : మ్యాచ్‌లో క్రీడాభిమానుల సందడి నెలకొంది. స్టేడియంలోని గ్యాలరీలన్నీ సీఎస్‌కే జెర్సీలతో నిండిపోయి పసుపుమయంగా మారాయి. 90 శాతం వరకు సీఎస్‌కే జెర్సీల పేరుతో ఉన్నవే కనిపించాయి. హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రేక్షకుల నుంచి ఆశించిన ప్రోత్సాహం దక్కలేదు. స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన బ్లూ అండ్ రెడ్ కలర్ జెర్సీలు ధరించిన ప్రేక్షకులు అతి తక్కువ మంది మాత్రమే కనిపించారు. అలాగే మ్యాచ్‌కు ముందు సీఎస్‌కే, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్ల వార్మప్ చేయడానికి వచ్చారు. కొద్ది సమయం తర్వాత ధోనీ గ్రౌండ్‌లో అడుగుపెట్టిన వెంటనే ప్రేక్షకుల కేరింతలు కొట్టారు. ధోనీ కొద్దిసేపు వార్మర్ చేసి తిరిగి డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయాడు. మరోవైపు స్టేడియానికి వెళ్లే మార్గంతో చెన్నై సూపర్ కింగ్స్ పసుపు రంగు జెర్సీల అమ్మకాలు జోరుగా జరిగాయి. దారి పొడుగునా సీఎస్‌కే జెర్సీలు, క్యాప్స్, ఫ్లాగ్స్ స్టాల్స్ కనిపించాయి. మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే ప్రేక్షకులు ధోనీ పేరుతో ఉన్న జెర్సీలు కొని, అక్కడే వేసుకుని స్టేడియానికి వెళ్లడంతో మార్గమంతా పసుపుమయంగా మారింది.

నగరానికి చేరుకున్న 'కోల్‌కతా నైట్ రైడర్స్'



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న జట్టు సభ్యులు

గోపాలపట్నం, మార్చి 31: పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఏప్రిల్ మూడున జరగనున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొనేందుకు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు సభ్యులు నగరానికి చేరుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి విమానంలో విశాఖ చేరుకున్న వారికి క్రీడాభిమానులు స్వాగతం పలికారు. అనంతరం జట్టు సభ్యులు రోడ్డు మార్గం గుండా హోటల్ నోవాటెల్‌కు చేరుకున్నారు.

క్రైం... crime news

వెంకన్నపాలెంలో చోరీ

» 100 గ్రాముల బంగారం అపహరణ

మాకవరపాలెం, మార్చి 31: మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో ఓ ఇంట్లో శని వారం చోరీ జరిగింది. 100 గ్రాముల బంగారం అపహరణకు గురైంది. దీనికి సంబంధించి ఎస్‌ఐ రామకృష్ణారావు ఆది వారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని వెంకన్నపాలెం గ్రామానికి చెందిన రెడ్డి శ్రీను శుక్రవారం బంధువుల వివాహానికి పరవాడ మండలం తానాం వెళ్లారు. శనివారం రాత్రి 7 గంటలకు తిరిగి ఇంటికి వచ్చే సరికి తలుపులు తీసి ఉన్నాయి. బీరువాలోని దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని 100 గ్రాముల బంగారం అపహరణకు గురైనట్టు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ హరి, ఎస్‌ఐ రామకృష్ణారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

కశింకోట, మార్చి 31: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కన్నూరుపాలెం వద్ద ఆదివారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి సీఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలివి. కచ్చెర్లపాలెం ప్రాంతానికి చెందిన ఆరపురెడ్డి పవన్(19) లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై తాళ్ళపాలెం వైపు వెళుతుండగా అనకాపల్లి నుంచి నర్సీపట్నం వస్తున్న ఆర్టీసీ బస్సు కన్నూరుపాలెం వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడి అన్నయ్య ఆరపురెడ్డి సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

వీఆర్‌వో విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు

కొత్తూరు, మార్చి 31 : మండలంలోని గోపాలపురం వీఆర్‌వోగా పని చేస్తున్న వంతల వినోద్ విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ జి.తేజేశ్వరరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆదివారం ఆయన తెలిపిన వివరాలివి. శనివారం సాయంత్రం వీఆర్‌వో వినోద్ తన సిబ్బందితో గోపాలపురం గ్రామంలో ఉన్న కొండ పోరంబోకు స్థలాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు వెళ్లారు. అయితే అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తన విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఆ ముగ్గురు వ్యక్తుల వివరాలు ఎస్‌ఐ వెల్లడించలేదు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



కారె ఇస్సాక్ (ఫైల్ ఫొటో)

ఎస్.రాయవరం, మార్చి 31: మనస్తాపంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి ఎస్‌ఐ విభీషణరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన కారె ఇస్సాక్(25)ను ఓ యువతి విషయంపై అదే గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు తరచూ బెదిరిస్తున్నారు. ఆదివారం కూడా ఇస్సాక్‌ను ఆ కుటుంబ సభ్యులు బెదిరించడంతో మనస్తాపం చెందిన ఆ యువకుడు పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న ఇస్సాక్ కుటుంబ సభ్యులు వెంటనే నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆ యువకుడు మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

కేసీఆర్‌కు పట్టిన గతే జగన్‌కు..

» కూటమి గెలిస్తే ముఖ్యమంత్రి అవినీతి సొమ్మును కక్కించి ప్రజలకు పంచిపెడతాం

» సకాలంలో పింఛన్లు పంపిణీ చేయకపోతే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

» బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్



ప్రసంగిస్తున్న బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

సబ్బవరం, మార్చి 31: తెలంగాణలో కేసీఆర్‌కు పట్టిన గతే ఆంధ్రాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి పట్టనుందని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. మండలంలోని అసకపల్లి గ్రామంలో సర్పంచ్ కర్రి నర్సింగరావు ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఆయన అనుచరులు పలువురు జనసేన పార్టీలో చేరారు. వారికి సీఎం రమేశ్, పంచకర్ల పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం సీఎం రమేశ్ మాట్లాడుతూ తెలంగాణలో కేసీఆర్ ఓడిపోయిన తరువాత ఆ పార్టీ ఖాళీ అయిందని, అదే గతి ఇక్కడ జగన్‌కు పట్టనుందన్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మంత్రిగా, డిప్యూటీ సీఎంగా ఈ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. ఆయన ఎంపీగా గెలిస్తే నేరుగా ఢిల్లీకి వెళ్లే సత్తా లేదని, ఏ రెడ్డినో వెంట పెట్టుకొని వెళ్లడం తప్ప చేయగలిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కూటమి గెలిస్తే ముఖ్యమంత్రి అవినీతి సొమ్మంతా కక్కించి ప్రజలకు పంచిపెడతామన్నారు. రాష్ట్రంలో పింఛన్లు ఇవ్వకుండా చేసి ఆ నెపం టీడీపీపై నెట్టే ప్రయత్నం జరుగుతోందని, సచివాలయ సిబ్బందితో సకాలంలో పింఛన్లు పంపిణీ చేసే ఏర్పాట్లు అధికారులు చేయాలని, లేకుంటే ఈసీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. బూడి ఎంపీగా గెలిస్తే కేంద్రంలో ఎవరికి సపోర్టు చేస్తారో ఆయన గానీ, వాళ్ల ముఖ్యమంత్రికి గానీ చెప్పే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. ఎంపీగా తనను గెలిపిస్తే ఈ ప్రాంతానికి పరిశ్రమలు, యువతకు విద్య, ఉపాధి అవకాశాల కోసం కృషి చేస్తానన్నారు. ఎంపీగా తనకు కమలం గుర్తుపైన, ఎమ్మెల్యేగా పంచకర్లకు గ్లాసు గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. పంచకర్ల మాట్లాడుతూ దమ్ము, ఖలేజా ఉన్న నాయకుడికి ప్రాంతంతో సంబంధం లేదన్నారు. ఢిల్లీలో చక్రం తిప్పగల సత్తా కలిగిన మంచి మనసున్న నాయకుడు సీఎం రమేశ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి గొర్లి రామునాయుడు, జనసేన నేతలు పంచకర్ల వెంకటేశ్వరరావు, ఇందలి వెంకటరమణ, బీఏ రావు, గండి దుర్గాప్రసాద్, కర్రి కనకరాజు, పలువురు జనసైనికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైసీపీకి భీమిలి జడ్పీటీసీ సభ్యుడు రాజీనామా

» పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటన



మాట్లాడుతున్న వెంకటప్పుడు

భీమునిపట్నం రూరల్, మార్చి 31: విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పుడు తన పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. అతనితో పాటు మరికొంతమంది నేతలు కూడా తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం తగరపువలసలో నిర్వహించిన సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పుడు మాట్లాడుతూ ధర్మం వైపు నిలబడాలనే ఉద్దేశంతో వైసీపీకి రాజీనామా చేస్తున్నామన్నారు. వైసీపీలో కక్షసాధింపులు తప్ప అభివృద్ధి లేదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళా తీయడంతో నిరుద్యోగం పెరిగిపోయిందని, వాటికి నిరసనగా పార్టీ నుంచి వైదొలగుతున్నామన్నారు. వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలిచినందున జడ్పీటీసీ పదవికి కూడా సంబంధిత నమూనాలో రాజీనామా చేసి, జిల్లా పరిషత్ సీఈవోకు పంపిస్తున్నామన్నారు. జడ్పీటీసీ సభ్యుడితో పాటు మండలంలోని సింగనబంద సర్పంచి జీవీ నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తుపాకుల పైడిరాజు, పీఏసీఎస్ డైరెక్టరు గాడు తాతినాయుడు, వివిధ పంచాయతీల ఉప సర్పంచులు బుద్దరాజు సత్యనారాయణరాజు, నీలాపు అనసూయ, భుక్త రమావతి, ఎనిమిది పంచాయతీలకు చెందిన 32 మంది వార్డుసభ్యులు, సచివాలయ కన్వీనర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

జనసేనలో వైసీపీ సర్పంచ్, మాజీ సర్పంచుల చేరిక



సుందరపు సమక్షంలో జనసేన పార్టీలో చేరిన మామిడివాడ వైసీపీ సర్పంచ్ మట్ట అప్పలనర్సమ్మ, వైసీపీ మాజీ సర్పంచులు

రాంబిల్లి, మార్చి 31: మండలంలోని మామిడివాడ పంచాయతీకి చెందిన వైసీపీ ప్రస్తుత సర్పంచ్ మాట్టా అప్పలనర్సమ్మ, మాజీ సర్పంచులు బొడ్డేడ భాస్కరరావు, చందర సూరిబాబు, మాజీ వార్డు సభ్యులు చుక్కా నల్లమారి, పార్టీ సీనియర్ నాయకులు ఆడారి పరమేశ్వరరావులు తమ అనుచరులతో ఆదివారం హరిపురం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎలమంచిలి అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారికి విజయకుమార్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు కనీస నిదులు ఇవ్వకపోవడంతో సర్పంచులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు సర్పంచులకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాంబిల్లి, అచ్యుతాపురం మండలశాఖ అధ్యక్షులు పప్పల నూకన్నదొర, భైలపూడి రామదాసు, మాజీ జడ్పీటీసీ సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, ఉరిటి నానాజీ పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

దిబ్బపాలెంలో భారీగా చేరిక

అచ్యుతాపురం: సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం పంచాయతీ) వైసీపీ నుంచి ఆదివారం భారీగా జనసేనలోకి చేరారు. దిబ్బపాలెం మాజీ ఎంపీటీసీ సభ్యుడు తుమ్మల రాజు తన అనుచరులతో జనసేనలో చేరారు. అలాగే చిప్పాడలో కూడా పలువురు వైసీపీ నాయకులు జనసేనలో చేరారు. వీరందరికి ఉమ్మడి అభ్యర్థి సుందరపు విజయకుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో భైలపూడి శ్రీరామదాసు, జనసరెడ్డి శ్రీనివాసరావు, పల్లి రామునాయుడు, తుమ్మల సుధ, ముప్పిడి రవి, పుణ్యమంతుల సత్తిబాబు, కూనిశెట్టి రవి, అందె చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో నూకాంబిక ఆలయం కిటకిట



బాలాలయంలో నూకాంబికను దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మార్చి 31: ఉత్తరాంధ్రలోని ప్రఖ్యాతిగాంచిన స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున బాలాలయంలో అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని భక్తులు కుటుంబసమేతంగా అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. మధ్యాహ్నం మూడు గంటలు దాటినా ఆలయంలో భక్తుల సందడి తగ్గలేదు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ కాటేజీలు, పరిసర ప్రాంతాల్లో వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

రారెత్తిస్తున్న ఎండలు

» అనకాపల్లిలో 36.8 డిగ్రీల ఉష్ణోగ్రత

అనకాపల్లి టౌన్, మార్చి 31: అనకాపల్లి పట్టణంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఆదివారం అత్యధిక ఉష్ణోగ్రత 36.8 డిగ్రీలు, అత్యల్ప ఉష్ణోగ్రత 23.0 డిగ్రీలుగా నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఉదయం నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఎండ వేడికి వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

పార్లమెంట్ నియోజకవర్గ వైసీపీ పరిశీలకురాలిగా ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్, మార్చి 31: వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులిగా ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి నియమితులయ్యారు. పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం లేఖ పంపినట్టు ఎంపీ కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు లేఖను విడుదల చేశారు.

సచివాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం, మార్చి 31: విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో మండలంలోని 11 సచివాలయాలకు విద్యుత్ శాఖ అధికారులు సరఫరాను నిలిపివేశారు. మండలంలో పెదపాడు, ఖాజీపాలెం, జగ్గన్నపేట, తిమ్మరాజుపేట, కొండకర్ల, వెదురువాడ, గొర్లె ధర్మవరం, చోడపల్లి, భోగాపురం సచివాలయాలకు ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

అడవుల్లో అగ్ని ప్రమాదాలకు చెక్

నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

ఉద్యోగులకు ఏపీ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి ఆదేశం



అటవీ శాఖ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఏపీ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి

చింతపల్లి, మార్చి 31: అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఉద్యోగులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (ఏపీ పీసీసీఎఫ్), హెడ్ ఆఫ్ ఫారెస్టు ఫోర్స్ చిరంజీవిచౌదరి ఆదేశించారు. ఆదివారం చింతపల్లి డివిజన్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. డివిజన్ కార్యాలయం, డీఎఫ్‌వో బంగ్లా నిర్మాణాల ప్రణాళికలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డివిజన్ స్థాయి అటవీ శాఖ ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో చెట్ల నుంచి ఆకులు రాలిపోతాయని, వేట కోసం అడవికి వెళ్లిన ఆదివాసీలు అగ్గి పెట్టుకుని ఆర్పి వేయకుండా వచ్చేయడం వల్ల అడవులు దహనమవుతున్నాయన్నారు. ప్రధానంగా వెదురు మొక్కలు కలిగిన ప్రాంతంలో అగ్ని ప్రమదాలు జరుగుతున్నాయన్నారు. డివిజన్ పరిధిలో సీలేరు, ఆర్‌వీనగర్, చింతపల్లి, మర్రిపాకలు (డౌనూరు) రేంజ్‌ల పరిధిలో అగ్ని ప్రమాదాల ప్రాంతాలు అధికంగా ఉండడంతో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అటవీశాఖ ఉద్యోగులు గిరిజన గ్రామాల్లో అవగాహన సదస్సులు, క్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను విస్తృతంగా పంపిణీ చేస్తున్నామన్నారు. నూతనంగా ఏర్పాటైన డివిజన్‌లో రేంజ్‌లకు శాశ్వత కార్యాలయ భవనాలు లేవన్నారు. ఈ మేరకు శాశ్వత భవనాలు మంజూరయ్యే వరకు తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. డివిజన్ పరిధిలో టేకు ప్లాంటేషన్‌లో ఎండిపోయిన చెట్లను ఉద్యోగులు గుర్తించి నిబంధనలు అనుసరిస్తూ తొలగించాలన్నారు. ఎండిపోయిన చెట్ల వల్ల ప్రయోజనంలేదని, తక్షణమే ఈ కార్యక్రమం ప్రారంభించాలన్నారు. అలాతే కొత్త మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శ్రీకంఠనాథరెడ్డి, స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందర్, చింతపల్లి డీఎఫ్‌వో చిట్టపులి సూర్యనారాయణ, ఆర్‌వీనగర్ సబ్ డీఎఫ్‌వో బీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నేతలతో మాట్లాడుతున్న పార్టీ అభ్యర్థి రమేశ్‌నాయుడు

కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలి

» పాడేరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి రమేశ్‌నాయుడు

పాడేరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ఎంపీ, పాడేరు అసెంబ్లీ కూటమి అభ్యర్థుల గెలుపునకు టీడీపీ శ్రేణులు కృషిచేయాలని స్థానిక అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కిల్లు వెంకటరమేశ్‌నాయుడు కోరారు. తన నివాసంలో ఆదివారం ఉదయం కలిసిన పాడేరు, జి.మాడుగుల ముఖ్య నేతలతో ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా మోదీ ప్రధాని కావడం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతపై ఓటర్లను చైతన్యవంతం చేయాలని, కూటమి ప్రభుత్వం ఏర్పడడం అనివార్యమని ప్రజలకు తెలిపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాడేరు, జి.మాడుగుల మండలాల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి రమేశ్‌ను గెలిపించుకుందాం

» బీజేపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కృష్ణారావు



పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న బీజేపీ పాడేరు అసెంబ్లీ కన్వీనర్ కృష్ణారావు

గూడెంకొత్తవీధి, మార్చి 31: పాడేరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి కిల్లు రమేశ్ నాయుడును గెలిపించుకుందామని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కూడా కృష్ణారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బీజేపీ ముఖ్యనాయకులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం కుంటుబడిపోయాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సైతం రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసిందన్నారు. పంచాయతీలకు మంజూరు చేసిన నిధులు దారి మళ్లించడం అన్యాయమన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిని సీఎం జగన్ విస్మరించారన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే ఎన్డీకే కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆయన పేర్కొన్నారు. అలాగే కేంద్రంలో మరోసారి మోదీ ప్రధాని కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వనపల జోగిరాజు, లకే రాము, మొట్టడం లక్ష్మణరావు, లకే ప్రసాదరావు, మత్స్యరాస రామ్ కిరణ్‌కుమార్‌రాజు, మామిడ పాపారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పాడేరు రూరల్, మార్చి 31: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మను దర్శించుకొనేందుకు ఆదివారం భక్తులు బారులు తీరారు. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఘటాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన్యంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకులు వందలాది మంది అమ్మవారి దర్శనానికి రావడంతో ఆలయం భక్తులతో మరింత రద్దీగా మారింది. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఘటాలను సమర్పించి పండగ జరుపుకొని ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకొని సాయంత్రం వరకు అమ్మవారి సన్నిధిలో గడిపారు. సాయంత్రం 5 గంటల వరకు ఆలయం భక్తులతో సందడిగా మారింది. ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ప్రసాద కమిటీ సభ్యులు కొట్టగుళ్లి రామారావు, పోతురాజు, సిద్ధినాతి కొండలరావు, బొడ్డు ముకుందరావు తదితరులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్‌లో ఉన్న మోదకొండమ్మ పాదాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

పాడేరు రూరల్, మార్చి 31: జిల్లా కేంద్రం పాడేరులోని సుంద్రుపుట్టులో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ 14వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచి ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామి దర్శనానికి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.



పూజలు అందుకున్న అభయాంజనేయస్వామి

అక్రమ నిర్మాణంపై అధికారులకు ఫిర్యాదు



అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారి

జి.మాడుగుల, మార్చి 31: ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణంపై అధికారులకు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ను అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి భవన నిర్మాణ పనులు చేపడున్నాడు. దీంతో ఆర్టీసీ అధికారి వచ్చి పరిశీలించారు. పునాది దశలోనే ఇది ప్రభుత్వ స్థలమని సంబంధిత అధికారులు అడ్డగించినా వినకుండా పనులు కొనసాగిస్తుండడంతో ఆర్టీసీ అధికారులు సదరు వ్యక్తిపై తహసీల్దార్‌తో పాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

రేగలో ఇల్లు దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన సామగ్రి

అరకులోయ, మార్చి 31: మండలంలో బొండాం పంచాయతీ పరిధిలోని రేగ గ్రామంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామంలోని పాంగి చిట్టిబాబు అనే గిరిజనరుడి ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన జరిగిన సమయంలో ఇంట్లో వారు ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ఇంట్లో ఉన్న ఫ్రిజ్, బీరువా, పంట ఉత్పత్తులు, విలువైన పత్రాలు కాలి బూడిదయ్యాయి. గ్రామస్థులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. అయితే ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ సంఘటనపై రెవెన్యూ గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి ప్రమాదంలో నష్టపోయిన గిరిజనుడి కుటుంబానికి అవసరమైన ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరకులను పంపిణీ చేయాలని రేగ గ్రామస్థులు కోరుతున్నారు.

మన్యంలో ఘనంగా ఈస్టర్ వేడుకలు





సీలేరు యూసీబీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు.. అరకులో చర్చిలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

పాడేరు రూరల్/అరకులోయ/డుంబ్రిగుడ/కొయ్యూరు/సీలేరు, మార్చి 31: ఏసు క్రీస్తు పునరుత్థానం పొందిన ఈస్టర్ పర్వదినాన్ని అల్లూరి జిల్లాలోని పాడేరు మన్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రేమ, శాంతిని బోధించిన ఏసుక్రీస్తు సర్వ మానవాళి చేసిన పాప క్షమాపణ కోసం తన రక్తాన్ని చిందించి శిలువపై ప్రాణాలు అర్పించి తిరిగి మూడో రోజు సమాధి నుంచి లేచిన దినమే ఈస్టర్ పర్వదినమని పాస్టర్లు బోధించారు. క్రైస్తవ మత విశ్వాస ప్రకారం ఏసుక్రీస్తు శుక్రవారం (గుడ్ ఫ్రైడే) శిలువ వేశాక, మూడో రోజు ఆదివారం సమాధి నుంచి లేచిన నేపథ్యంలో ఈస్టర్ పర్వదినంగా భావించే క్రైస్తవులు వేడుకలను నిర్వహించారు.

పాడేరులోని సీబీఎం చర్చ్, మోస్ట్‌బిగాడ్ చర్చ్, ద లార్డ్ ఆఫ్ జీసస్ క్రైస్తు చర్చి, జేసీ కవనెంట్ చర్చి, కల్వరి బాప్టిస్ట్ చర్చి, సియోన్ ప్రార్థనా మందిరం, చర్చ్ ఆఫ్ దలివింగ్ గాడ్ ఫెలోషిప్, అగాపే చర్చ్, బేతని ప్రార్థన మందిరంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పాడేరు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

అలాగే అరకులో క్రైస్తవులంతా ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. యండపల్లివలసలోని ఆర్‌సీఎం చర్చ్‌లో ఈస్టర్ వేడుకలను ఫాదర్ జేసుదాసు ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. వందలాది మంది విశ్వాసులతో ర్యాలీ చేశారు. అలాగే సుంకరమెట్ట సీబీఎం చర్చిలో అరకు సీబీఎం చర్చిలో వేడుకలు ఘనంగా జరిపారు.

డుంబ్రిగుడ మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఘనంగా ఈస్టర్ పరవదినాన్ని పురస్కరించుకొని చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. డుంబ్రిగుడలోని సియోను, సారోను, యూసీబీఎం చర్చిలలో క్రైస్తవ సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పలహారాలను భుజించారు. అలాగే అరకు, కించుమండ, గుంటసీమలలో క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

కొయ్యూరు మండలంలో ప్రపంచ శాంతిదూత ఏసుక్రీస్తు సర్వజనులకు ప్రేమ చూపిన కరుణామయుడు అని క్రైస్తవ మత ప్రబోధకులు పేర్కొన్నారు. మండలంలోని చర్చిలలో ఈస్టర్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. రాజేంద్రపాలెం యునైటెడ్ చర్చి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏసుక్రీస్తు భక్తి గీతాలాపనలతో ర్యాలీ చేశారు. అలాగే రావణాపల్లి కొమ్మిక, శరభన్నపాలెం, కాకరపాడు తదితర ప్రార్థనా మందిరాలలో ఈస్టర్ పర్వదినాన్ని నిర్వహించారు.

గూడెంకొత్తవీధి మండలంలో సీలేరు, ధారకొండ పంచాయతీల్లోని పలు చర్చిల్లో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈస్టర్‌ను పురస్కరించుకుని శనివారం రాత్రి నుంచే సీలేరు యూసీబీఎం, పెంతుకోస్తు, కల్వరి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఆదివారం ఉదయం క్రైస్తవుల సమాధుల వద్దకు వెళ్లి పూలదండలను, పుష్పగుచ్ఛాలను పెట్టి అక్కడ ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రైస్తవులు యూసీబీఎం చర్చికి వెళ్ళి అక్కడ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.





పాడేరు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న పాస్టర్లు... కొయ్యూరులోని రాజేంద్రపాలెంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

పాడేరు టికెట్‌పై టీడీపీ అధిష్ఠానం ఆలోచించాలి



కొయ్యూరులో ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు

కొయ్యూరు, మార్చి 31: పాడేరు అసెంబ్లీ టికెట్ కేటాయింపు విషయంలో అధిష్ఠానం పునరాలోచించాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పార్టీని నమ్ముకుని ఉన్న వారిని కాకుండా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న వ్యక్తికి టికెట్ కేటాయించడం న్యాయమా? అని ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని నియోజకవర్గంలో సీనియర్లలో గెలుపు సామర్థ్యం కలిగిన వారికి టిక్కెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ మండల కార్యదర్శి తోట దొరబాబు, తెలుగు యువత కార్యదర్శి వజ్రపు వెంకటరమణ, ఎస్టీ సెల్ కార్యదర్శి జంపా వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకుని ఉన్న నాయకులకు అధినేతలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో పునరాలోచించాలని కోరారు.

కూటమిలో గిడ్డి ఈశ్వరికి టికెట్ ఇవ్వాలి

జి.మాడుగుల: పాడేరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి టికెట్ ఇవ్వాలని టీడీపీ మండల నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజవర్గంలోని క్షేత్రస్థాయిలో గిడ్డి ఈశ్వరి కార్యకర్తలను తయారుచేసి పార్టీని పటిష్ఠంగా తీర్చిదిద్దారని చెప్పారు. అటువంటి వ్యక్తికి టికెట్ కేటాయిస్తేనే గెలుపు ఖాయని, ఈ విషంలో అధిష్ఠానం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వంతాల కొండలరావు, కె.ఈశ్వరరావు, అప్పారావు, జి.కొండబాబు, ఎం.రామరావు, శాంతికుమారి, ఎల్.రామకష్ణ, చిరంజీవినాయుడు, నితిన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అరకు అభ్యర్థి విషయంలో పునరాలోచించాలి

డుంబ్రిగుడ: అరకు అసెంబ్లీ టికెట్ కేటాయించడంపై అధిష్ఠానం పునరాలోచించాలని టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు కోరారు. పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన మాట్లాడుతూ అరకులోయ నియోజకవర్గంలో పార్టీ పూర్వ వైభవానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారన్నారు. నిండు సభలో రాష్ట్రంలోనే మొదటగా అరకు టికెట్‌ను దొన్నుదొరకు ప్రకటించడంతో ఎంతో ఉత్సాహపడ్డామని, అనూహ్యంగా బీజేపీకి కేటాయించడం విచారకరమని వాపోయారు. ఇప్పటికైనా పార్టీ అధిష్ఠానం ఆలోచించిన తగిన న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సుబ్బారావు, కమ్మిడి సుబ్బారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో...

హుకుంపేట: అరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ నేత దొన్నుదొరను ప్రకటించాలని పార్టీ మండల అధ్యక్షుడు కొర్రా తులసీరావు కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి కలిసి పోటీ చేయడం అభ్యంతరం లేదని, అయితే ముందుగా ప్రకటించిన విధంగా దొన్నుదొరను అభ్యర్థిగా కొనసాగించాలని విన్నవించారు. ఈ విషయంలో పార్టీ అధినేత చంద్రబాబు పునరాలోచించాలని కోరారు. అతని వెంట పార్టీ నాయకులు బాలన్న, అచ్చమ్మ, శంకర్, సుబ్బారావు, లక్ష్మయ్య, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

16 నాటు తుపాకులు సరండర్

చింతపల్లి, మార్చి 31: మండలంలోని గిరిజనులు స్వచ్ఛందంగా 16 నాటు తుపాకులను అప్పగించారని ఎస్‌ఐ అరుణ్ కిరణ్ తెలిపారు. కిటుముల, అంజలిశనివారం పంచాయతీల పరిధిలోని 16 మంది గిరిజనులు వినియోగిస్తున్న 16 నాటు తుపాకులను స్వచ్ఛందంగా సరెండర్ చేశారన్నారు. ఇప్పటికీ ఆదివాసీల వద్ద నాటు తుపాకులు ఉంటే వెంటనే పోలీసు స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. పోలీసు సోదాల్లో గిరిజనుల వద్ద నాటు తుపాకులు పట్టుబడితే కచ్చితంగా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కేసుల్లో నిందితులకు పదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని ఆదివాసీలు వద్ద ఇప్పటికి నాటు తుపాకులు ఉంటే వెంటనే పోలీసు స్టేషన్‌కి తీసుకొచ్చి అప్పగించాలని ఆయన పిలుపునిచ్చారు.

సుత్తిగూడలో పాఠశాల భవనం నిర్మించరూ..

ముంచంగిపుట్టు, మార్చి 31: మండలంలో మారుమూల లక్ష్మీపురం పంచాయతీ సుత్తిగూడ గ్రామంలో నూతన పాఠశాల భవనం నిర్మించాలని సర్పంచ్ క్రైతినాథ్, గ్రామస్థులు కోరుతున్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో పాఠశాల భవనం దుస్థితి, విద్యార్థుల సమస్యలను వివరించారు. కాలం చెల్లిపోవడంతో సుమారు ఐదేళ్ల క్రితం ఈ పాఠశాల భవనాన్ని నేలమట్టం చేశారు. నూతన పాఠశాల భవన నిర్మాణంకు సంబంధించి నాడు నేడు పథకం క్రింద నిధులు సుమారు ఏడాది క్రితం మంజూరయ్యాయి. పాఠశాల భవన నిర్మాణంకు సంబంధించి పునాదుల స్థాయి వరకు పనులు జరిగాయి. అంతకు మించి పనులు ముందుకు సాగడంలేదు. పనులు ఎందుకు మధ్యలో ఆపేశారని సంబంధిత అధికారులను అడగగా నిధులు వెనక్కి వెళ్లిపోయాయని బదిలిస్తున్నారు. దీంతో చిన్నపాటి గదిలోనే పాఠశాల నిర్వాహణ జరుగుతుందని వారు తెలిపారు. చిన్నగదిలో చదువుకొనేందుకు పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పనులు పూర్తి అయ్యే విధంగా తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

వట్టిబూసులలో గిరిజనులకు దుస్తుల పంపిణీ

చింతపల్లి, మార్చి 31: మండలంలోని బెన్నవరం పంచాయతీ వట్టిబూసుల గ్రామంలో గిరిజనులకు చేయూత వారియర్స్ సభ్యులు దుస్తులు పంపిణీ చేశారు. ఆదివారం గ్రామాన్ని సందర్శించిన వృద్ధులు, మహిళలకు చీరలు అందించారు. ఈ సందర్భంగా వారియర్స్ చైర్మన్ మాట్లాడుతూ కొంత కాలంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, మరింత విస్తరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు ఇండుగ శేఖర్, సాగిన జగన్, శివ పాల్గొన్నారు.

ఆశలు అవుట్!

... 3వ పేజీ తరువాయి

ఉద్యోగులకు మేలు జరిగేది. ప్రస్తుతం కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు రూ.18 వేల నుంచి రూ.38 వేల వరకు వేతనం లభిస్తోంది. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి ఉంటే.. రెగ్యులర్ ఉద్యోగులకు లభించే వేతనం దక్కేది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ.24 వేలు చెల్లిస్తున్నారు. కనీస వేతనాల హామీ అమలైతే రూ.30 వేలకుపైగా లభించేదని చెబుతున్నారు. అదే సమయంలో ఈ రెండు కేటగిరీల్లో ఉద్యోగ భద్రత ఉండేదంటున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలయ్యేదని పేర్కొంటున్నారు.

కేంద్ర పథకమంటూ దాటవేత

కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని అమలుచేయాలని ఉద్యోగులు కోరితే.. ప్రభుత్వ పెద్దలు భిన్నమైన వాదనను తెరపైకి తీసుకు వచ్చారని చెబుతున్నారు. సమగ్ర శిక్ష అభియాన్, నేషనల్ హెల్త్ మిషన్ వంటి స్కీమ్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుచేస్తున్నాయని, వీటిలో పనిచేసే వారిని రెగ్యులరైజ్ చేయలేమని ప్రభుత్వం స్పష్టం చేసిందంటున్నారు. పాదయాత్ర సమయంలో ఈ అంశాలపై జగన్‌కు అవగాహన ఉన్నప్పటికీ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత మాట మారుస్తున్నారని ఉద్యోగులు మండిపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అమలుచేస్తున్న పథకాల్లోనే సుమారు నాలుగు వేల మంది వరకు కాంట్రాక్టు ఉద్యోగులున్నారని, వారందరినీ మభ్య పెట్టి.. ఈ తరహా వ్యాఖ్యలు చేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దాహం కేకలు

... 3వ పేజీ తరువాయి

సరఫరా నిలిచిపోయింది.

ఐదు వీధుల్లో నెల రోజులుగా నీటి సరఫరా బంద్

మండల కేంద్రంలోని ఐదు వీధుల్లో నెల రోజులుగా నీటి సరఫరా పూర్తిగా బంద్ అయ్యింది. రామాలయం, నెయ్యల వీధి, మైలుకూలివీధి, సాయినగర్, ఐటీడీఏ క్వార్టర్స్‌లో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో రామాలయం, నెయ్యలవీధి, మైలుకూలివీధి మహిళలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపైపు(ఊటగెడ్డ) వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఐటీడీఏ క్వార్టర్స్ మహిళలు కిలోమీటరు దూరంలో కొండపైనున్న ఊట గెడ్డ వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. సాయినగర్ ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గం లేదు. ఎక్కడికి వెళ్లాల్సి వచ్చినా మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాలి. దీంతో స్థానిక మహిళలు ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా పెదపైపు నుంచి ఒక ట్యాంక్‌కి రూ.400 నుంచి రూ.500 వెచ్చించి నీళ్లు తెప్పించుకుంటున్నారు. ప్రస్తుతం నీళ్ల కోసం మండల కేంద్రం మహిళలు తల్లడిల్లిపోతున్నారు.

నీటి సరఫరాపై చర్యలు శూన్యం

నెల రోజులుగా మండల కేంద్రం ప్రజలు నీళ్ల కోసం నానా అవస్థలు పడుతున్నప్పటికి ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్, పంచాయతీ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. సీపీడబ్ల్యూ పథకం ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలి. ఇప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు ప్రతిపాదనలకే పరిమితం

ప్రజల దాహార్తిని తీర్చేందుకు అధికారుల ప్రత్యామ్నాయ చర్యలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. చిన్నగెడ్డ, గూణలంక బావులు ఎండిపోవడంతో సెరీకల్చర్ వద్దనున్న పాత బావిని గత ఏడాది బాగు చేశారు. అయితే ఈ బావిలోనూ నీళ్లు ఊరడంలేదు. పెదపైపు వద్దనున్న మరో బావిని బాగు చేయాలని అధికారులు చెబుతున్నప్పటికి కార్యరూపం దాల్చడం లేదు. నీటి పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ అధికారులు, సీపీడబ్ల్యూ పథకం నిర్వహిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు నీటి సరఫరాకు ఎటువంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదు. గత ఏడాది ఇదే పరిస్థితి నెలకొన్న సమయంలో ప్రత్యామ్నాయ చర్యల కోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు హడావిడి చేశారు. జూలైలో వర్షాలు పడడంతో నీటి సమస్య తగ్గింది. దీంతో ప్రత్యామ్నాయ చర్యలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గాలికొదిలేశారు. దీంతో ఈ ఏడాది సమస్య మళ్లీ మొదటికొచ్చింది. చింతపల్లి సబ్ డివిజన్, మండల కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే శివారు గ్రామాల్లో నీటి సమస్య ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటికైనా మండల కేంద్రం ప్రజల నీటి సమస్య పరిష్కరించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టకపోతే ఏప్రిల్, మేలో నీళ్ల కోసం నరకయాతన అనుభవించాల్సి వుంటుందని స్థానికులు చెబుతున్నారు.

ఇలా చేస్తే మేలు

మండల కేంద్రంలోని పెదపైపు (ఊటగెడ్డ) సమీపంలో నూతనంగా బావిని నిర్మించి, ఈ బావి ద్వారా సీపీడబ్ల్యూ పథకానికి నీటి సరఫరా చేయవచ్చు. ఐటీడీఏ క్వార్టర్స్‌పైన చెక్కరాయి వీధిలో వేసవిలోనూ నీళ్లు ఊరే ఊటగెడ్డ వద్ద ట్యాంక్‌ను నిర్మించి గ్రావిటీ ద్వారా నీటి సరఫరా చేయవచ్చు. ఈ చర్యలు సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన తీసుకోకుంటే ఏప్రిల్, మేలో ప్రజలు నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది.

ఎవరూ పట్టించుకోవడం లేదు

- బి.మచ్చకొండమ్మ, ఐటీడీఏ క్వార్టర్స్, చింతపల్లి



ప్రభుత్వ అధికారులు, వైసీపీ నాయకులు ఇంటింటికి కొళాయి వేసి నీటి సరఫరా చేస్తామని గొప్పగా ప్రకటనలు చేస్తున్నారు. ఐటీడీఏ క్వార్టర్స్‌లో నెల రోజులుగా నీటి సరఫరా జరగలేదు. పలు మార్లు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి వెళ్లి ఇంజనీరింగ్ అధికారులకు మా మొర్ర వినిపించుకున్నాం. ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. మంచినీళ్ల సరఫరా చేయకపోతే మా బాధ ఎవరికి చెప్పుకోవాలి.

అధికారులు స్పందించకుంటే ఆందోళన

-బోనంగి పుష్పవతి, ఒకటో వార్డు సభ్యురాలు



నీటి సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే అధికారులు స్పందించాలి. నీళ్ల కోసం పలుమార్లు పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించుకున్నాం. వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి నీటి సరఫరా చేయాలి. కనీసం ట్యాంకర్ల ద్వారానైనా నీటి సరఫరా చేయాలి. లేదంటే ఎంపీడీవో కార్యాలయం, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతాం.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు

- జి.స్వర్ణలత, ఏఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, చింతపల్లి

బావులు ఎండిపోవడం వల్ల సీపీడబ్ల్యూ పథకం ద్వారా నీటి సరఫరా చేయలేకపోతున్నాం. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు పంచాయతీ నుంచి తీర్మానం తీసుకున్నాం. నీటి సరఫరాకు కాంట్రాక్టర్లను ఏర్పాటు చేస్తున్నాం. ఒకటి, రెండు రోజుల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తాం.

దక్షిణ అభ్యర్థి వంశీకృష్ణ

... 3వ పేజీ తరువాయి

బీజేపీ కూటమి మధ్య సీట్ల అవగాహన మేరకు దక్షిణ నియోజకవర్గం జనసేనకు కేటాయించడంతో వంశీకృష్ణ పోటీచేస్తారని తొలుత ప్రకటించారు. అయితే ఇటీవల రాష్ట్రంలో జనసేన పోటీచేసే 21 స్థానాలకు గాను 18 మంది అభ్యర్థులతో విడుదల చేసిన జాబితాలో వంశీ పేరు లేకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. అయితే ఆదివారం పిఠాపురంలో ఉన్న పవన్ కల్యాణ్ పార్టీ ముఖ్యనేతలతో చర్చించి, దక్షిణ టికెట్‌ను వంశీకి ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి అభ్యర్థులను ప్రకటించినట్టయింది.